# ప్రభాత ఉదయం

తెలుగు దినపత్రిక

సంపుటి: 2 | సంచిక: 210 | పేజీలు: 4 | వెల: రూ.3/- | గురువారం 7 అక్టోబర్ 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్




### ట్రంప్ గెలుపుతో భారత్ బంధం

## మరింత బలోపేతం

### అభినందనలు తెలిపిన ప్రధాని మోడీ

న్యూయార్క్, నవంబర్ 6 (ప్రభాత ఉదయం): అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించిన రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌నకు ప్రధాని నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. ట్రంప్ చరిత్రాత్మక విజయం సాధించారని ఎక్స్ లో ట్విట్ చేశారు. తమ మైత్రి వల్ల ..మిగతా 2లో

# అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్

- భారీ మెజార్టీతో రెండోసారి గెలుపు
- కమలా హ్యారిస్‌పై ఆధిక్యం ప్రదర్శన
- నాలుగేళ్ల విరామం తరవాత మళ్లీ వైట్‌హౌజ్‌కు రాక
- ట్రంప్‌కు కలిసి వచ్చిన బైడెన్ వైఫల్యాలు



న్యూయార్క్, నవంబర్ 6 (ప్రభాత ఉదయం): అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ఎన్నికయ్యారు. ఎన్నికల పోరులో ఎదురీది విజయం సాధించారు. అమెనికన్లను ఆకట్టుకుని విజేతగా నిలిచారు. అమెరికాలోని పత్రికలు జరిపిన సర్వేలన్నీ ఆయనకు వ్యతిరేకమని తేల్చినా.. ప్రజలు మాత్రం అండగా నిలిచారు. కొంత విరామంతో ఒక అభ్యర్థి అమెరికా అధ్యక్ష స్థానంపై తిరిగి కూర్చోవడం 131 ఏళ్ల తర్వాత ఇదే తొలిసారి కావడం విశేషం. అంతేకాదు.. ఎన్నికలకు ముందు కోర్టు కేసులు ఇబ్బంది పెట్టినా ఏమాత్రం వెనక్కి తగ్గకుండా చివరి వరకూ పోరాడారు. 2016 నాటి ఫలితాలకు భిన్నంగా ఈసారి పాపులర్ ఓటు కూడా ట్రంప్‌నకే లభించింది. ఆయనకు దాదాపు 51 శాతానికి పైగా ఓట్లు లభించగా.. ప్రస్తుత ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ 47 శాతం వద్దే ఆగిపోయారు. సంప్రదాయ రిపబ్లికన్ రాష్ట్రాలను నిలబెట్టుకోవడంతో పాటు.. గంపగుత్తగా స్వింగ్ స్టేట్స్ ఏడింటా ట్రంప్ హవా నడిచింది. ముఖ్యంగా అమెరికాలో ద్రవ్యోల్బణం, ఉద్యోగాలు, వేతనాలు, అక్రమ చొరబాట్లు వంటి అంశాలు ఈ ఎన్నికల్లో తిరుగులేని విధంగా ప్రభావాన్ని చూపాయి. అరబ్, ముస్లింలు అధికంగా ఉన్న జార్జియాలో ఈసారి మొదటి నుంచి కమలా హారిస్ వెనుకంజ లోనే ఉన్నారు. గతంలో ఇక్కడ బైడెన్ హవా నడిచింది. కానీ, గాజా యుద్ధం విషయంలో డెమోక్రాట్ల వైఖరిపై వీరు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. వీరిని బుజ్జగించేందుకు కమలా హారిస్ ప్రచారం చివరిలో కూడా తాను గాజాలో శాంతిని నెలకొల్పేందుకు వీలైనంతగా యత్నిస్తానని హామీ ఇచ్చారు. అదేమీ పెద్దగా ఫలితం చూపలేదు. మరో వైపు ట్రంప్ తాను అధికారంలోకి వస్తే వారం రోజుల్లో యుద్ధాన్ని ఆపేస్తానని హామీ ఇచ్చారు. దీనికి తోడు ఆయన హయాంలో అఫ్గాన్ యుద్ధాన్ని ఆపడం, మరే కొత్త యుద్ధంలోనూ ..మిగతా 2లో



### ఉపాధ్యక్ష అభ్యర్థి వాన్స్

## తెలుగు సంతతి అల్లుడు

### భార్య ఉష తెలుగు సంతతి మహిళ

**ఉషా చిలుకూరికి విశాఖ వాసులతో బంధుత్వం**

**ప్రొఫెసర్ శాంతమ్మకు ఉష మనవరాలి వరుస**

న్యూయార్క్, నవంబర్ 6 (ప్రభాత ఉదయం): అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ విజయం సాధించారు. ఇక రిపబ్లికన్ పార్టీ తమ ఉపాధ్యక్షునిగా జేడీ వాన్స్‌ను ప్రకటించిన విషయం విదితమే. తాజాగా విజయోత్సవ ప్రసంగంలో ట్రంప్ ఆయనను ప్రశంసలతో ముంచెత్తారు కూడా. అయితే, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తెలుగింటి అల్లుడు. ఆయన భార్య ఉష తెలుగు సంతతికి చెందినవారు. ఉషా చిలుకూరి విశాఖపట్నం వాసులకు బంధువు అవుతారు. నిరుటి వరకు విశాఖలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రొఫెసర్‌గా పని చేసిన శాంతమ్మ మనుమరాలు ఉషా చిలుకూరి. దీనితో ఆంధ్ర అల్లుడు అమెరికా ..మిగతా 2లో

## గవర్నర్‌తో సిఎం రేవంత్ భేటీ

### కులగణనపై వివరించిన సిఎం



హైదరాబాద్, నవంబర్ 6 (ప్రభాత ఉదయం): తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం రాజ్‌భవన్‌లో సమావేశమయ్యారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుల గణనకు సంబంధించిన వివరాలను ఈ సందర్భంగా గవర్నర్ వర్మకు ఆయన తెలిపారు. దేశానికి రోల్ మోడల్‌గా నిలిచేలా సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహిస్తున్నట్లు గవర్నర్‌కు సీఎం రేవంత్ రెడ్డి వివరించారు.

## దేశ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలి

**నైపుణ్య శిక్షణ అందించేందుకు స్కిల్స్ వర్సిటీ**

**సామాజిక న్యాయం కోసమే కులగణన సర్వే**

**విద్యార్థులతో ముఖాముఖిలో సిఎం రేవంత్**



హైదరాబాద్, నవంబర్ 6 (ప్రభాత ఉదయం): విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే తమ లక్ష్యమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు స్కిల్స్ కూడా అవసరమని అన్నారు. అందుకే యంగ్ ఇండియా స్కిల్ వర్సిటీ పెట్టమాని అన్నారు. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా నాణ్యమైన భోజనం కోసం డైట్ ఛార్జీలు పెంచామని అన్నారు. విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడారు. అందరికి విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. అందుకే డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచామని తెలిపారు. 21వేల మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించినట్లు చెప్పుకొచ్చారు. 11,062 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశామన్నారు. దేశ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని విద్యార్థులకు సూచించారు. సామాజిక న్యాయం అందించేందుకు ప్రభుత్వం కుల గణన సర్వే నిర్వహిస్తోందని.. ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీల కోసం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నామని చెప్పారు. ప్రతీ నియోజకవర్గంలో 20 నుంచి 25 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తున్నామని తెలిపారు. వచ్చే అకడమిక్ ఇయర్ లోగా నిర్మాణాలు పూర్తి ..మిగతా 2లో



## కొలువుదీరిన టిటిడి పాలక మండలి

### సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తాం

**తిరుమల పవిత్రత కాపాడడం ముందున్న లక్ష్యం**

**పాలకమండలి ఛైర్మన్ బిఆర్ నాయుడు వెల్లడి**

తిరుమల, నవంబర్ 6 (ప్రభాత ఉదయం): తిరుమల తిరుపతి నూతన పాలకమండలి బుధవారం కొలువు దీరింది. టీటీడీ ఛైర్మన్ బిఆర్ నాయుడు కొందరు సభ్యులు పదవీ ప్రమాణం చేశారు. అనంతరం శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా బిఆర్ నాయుడు మాట్లాడుతూ.. తమకు ఈ అవకాశం కల్పించిన సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన హిందూ పుణ్యక్షేత్రమైన తిరుమల పవిత్రతను కాపాడుకోవడమే ప్రస్తుత టీటీడీ ధర్మకర్తల మండలి ప్రాధాన్యత అని బి.ఆర్. నాయుడు తెలియజేశారు. ప్రమాణస్వీకారం అనంతరం బుధవారం సాయంత్రం తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో ఆయన తొలిసారిగా మీడియా సమావేశం నిర్వహించారు. ఈ నేపథ్యంలోనే పాలకమండలి ముందు చాలా సవాళ్లు ఉన్నాయన్నారు. రాబోవు ..మిగతా 2లో

## హైడ్రా నిర్మాణాలకు అనుమతి ఇవ్వదు

**బ్యాంకర్లు ఆందోళన చెందాల్సిన పనిలేదు**

**స్వయం సహాయక సంఘాలకు రుణాలు పెంచాలి**

**బ్యాంకర్లతో భేటీలో డిప్యూటి సిఎం భట్టి**




హైదరాబాద్, నవంబర్ 6 (ప్రభాత ఉదయం): బ్యాంకర్లు హైడ్రా గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. హైడ్రా భవనాల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. బుధవారం ప్రజా భవన్లో ఏర్పాటుచేసిన ప్రత్యేక బ్యాంకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జీహెచ్ఎంసీ, టౌన్‌ప్లానింగ్ వంటి ప్రభుత్వ విభాగాలు అన్ని అంశాలు పరిశీలించి నిర్మాణాలకు అనుమతులు ఇస్తాయని, ఏ ప్రభుత్వమైనా వీటిని కొనసాగిస్తాయని వివరించారు. హైడ్రా సెక్యూరిటీ, ట్రాఫిక్ నియంత్రణ, అక్రమార్కులు పార్కులు, సరస్సులు ఆక్రమించుకోకుండా చూస్తుందని తెలిపారు. ప్రభుత్వంలోని కొన్ని శాఖలకు బ్యాంకింగ్ రంగం ద్వారా చేయూతను అందించాలని ఉద్దేశంతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. కుటుంబాలకు ఆర్థికంగా చేయూతను ఇవ్వాలనేదే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వెనుక ఉన్న ఉద్దేశమన్నారు. స్వయం సహాయక సంఘాలకు ఈ ఏడాది 20వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇవ్వాలన్నారు భట్టి విక్రమార్క.. కార్పొరేట్ కమర్షియల్ బ్యాంకులు ..మిగతా 2లో



### ఆర్టికల్ 370 పునరుద్ధరణపై

## చర్చలు జరపాలి

**అసెంబ్లీలో పెట్టిన తీర్మానాన్ని ఆమోదించిన సభ్యులు**

శ్రీనగర్, నవంబర్ 6 (ప్రభాత ఉదయం): జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370 పునరుద్ధరణపై కేంద్ర ప్రభుత్వం చర్చలు జరుపాలని ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు. అసెంబ్లీలో బుధవారం ప్రవేశపెట్టిన ఈ తీర్మానాన్ని సభ్యులు ఆమోదిం చారు. 2019 ఆగస్ట్ 5న జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించే ఆర్టికల్ 370ను కేంద్రం రద్దు చేసింది. అలాగే ఆ రాష్ట్రాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించింది. కాగా, కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన ప్రత్యేక హోదాను పునరుద్ధరించే తీర్మానాన్ని జమ్మూకశ్మీర్ ఉప ముఖ్యమంత్రి సురీందర్ చౌదరి అసెంబ్లీలో బుధవారం ప్రవేశపెట్టారు. 'జమ్మూకశ్మీర్ ప్రజల గుర్తింపు, సంస్కృతి, హక్కులను కాపాడే ప్రత్యేక హోదా, రాజ్యాంగ హామీ ప్రాముఖ్యతను ఈ శాసనసభ పునరుద్ఘాటిస్తుంది. ఏకపక్ష తొలగింపుపై ఆందోళన వ్యక్తం చేసింది. జాతీయ ఐక్యత, జమ్మూకశ్మీర్ ప్రజల ఆకాంక్షలు రెండింటినీ కాపాడాలి. ఆర్టికల్ 370 పునరుద్ధరణ కోసం ఎన్నికైన ప్రజా ప్రతినిధులతో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరపాలి' ..మిగతా 2లో

# అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్

**మొదటి పేజీ తరువాయి...**

అమెరికా తలదూర్చకుండా ఉండటం కూడా సానుకూలంగా మారింది. ట్రంప్ మద్దతుదారులు వలస అంశానికే అత్యధిక ప్రాధాన్యం ఇచ్చారు. ఈ విషయాన్ని ఏపీ ఓట్ కాస్ట్ ప్రజాభిప్రాయ సేకరణ కూడా వెల్లడించింది. వాస్తవానికి ఉత్తర అమెరికాలో అక్రమ వలసదారులు పెద్ద సమస్యగా మారారు. ఈ విషయాన్ని ట్రంప్ బలంగా వాడుకొన్నారు. జార్జియాలోని ప్రచారంలో మాట్లాడుతూ ఏకంగా 1798 నాటి ఎలియన్ ఎనిమీస్ యాక్ట్‌ను తాను మళ్లీ తెరపైకి తెస్తానని హామీ ఇచ్చారు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో జపాన్, జర్మనీ, ఇటలీ వాసులను కట్టడి చేయడానికి దీనిని వాడేవారు. దీని ప్రకారం అక్రమ వలసదారులు అమెరికన్లను హత్య చేస్తే .. వారికి మరణదండన విధిస్తారు. ట్రంప్ విదేశాంగ విధానంలో యుద్ధాలకు పెద్దగా ప్రాధాన్యం లేకపోవడం ఓటర్లను ఆకర్షించిన అంశం. ఇప్పటికే ఉక్రెయిన్, గాజా యుద్ధాల్లో ఆ దేశం పాత్ర ఎక్కువగానే ఉంది. ముఖ్యంగా కీవ్‌ను కాపాడేందుకు బిలియన్ల డాలర్ల సొమ్ము ఇవ్వడం సగటు అమెరికా వాసికి నచ్చలేదు. ట్రంప్ అధికారంలో ఉంటే రష్యాతో సరిగ్గా డీల్ చేసేవారని స్వింగ్ స్టేట్స్‌లో నిర్వహించిన సర్వేల్లో ఓటర్లు అభిప్రాయపడ్డారు. చైనా విషయంలో బైడెన్ అత్యంత బలహీనంగా కనిపించారు.

మరోవైపు గతంలో ఏ నిర్ణయాన్ని అయినా రెండో ఆలోచన లేకుండా స్థిరంగా తీసుకోవడం ట్రంప్‌నకు స్ట్రాంగ్ మ్యాన్ ఇమేజ్ తీసుకొచ్చింది. ట్రంప్‌ను విజయతీరాలకు చేర్చిన బలమైన అంశాల్లో ఆర్థిక వ్యవస్థ నిర్వహణ కూడా ఒకటి. 2020లో బైడెన్ అధికారం చేపట్టాక తీసుకొన్న నిర్ణయాలతో అమెరికా చాలా కాలం ద్రవ్యోల్బణం కారణంగా ధరల పెరుగుదలతో అవస్థపడింది. అప్పట్లో బైడెనామిక్స్ అంటూ డెమోక్రాట్ల విధానాలను హేళన చేసే పరిస్థితి తలెత్తింది. బైడెన్ పాలసీల కారణంగా తాము అవస్థలు పడ్డామని చాలా మంది ఓటర్లు వెల్లడించారు. ట్రంప్‌నకు అమెరికాలోని గ్రామీణ ఓటర్ల నుంచి బలమైన మద్దతు ఉంది. సర్వేలు ఎన్ని చెప్పినా అయోవా వంటి రాష్ట్రాల్లో ఆయనే విజయం సాధించడానికి ఇదే కారణంగా నిలిచింది. ఇక జార్జియా, కెంటకీ, నార్త్ కరోలినాల్లో ఇదే ఆయనకు ఆధిక్యం తీసుకొచ్చింది. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ తరఫున పోటీ చేసిన డొనాల్డ్ ట్రంప్ భారీ విజయం దిశగా దూసుకెల్లారు. ఇప్పటికే ఆయన 300కుపైగా ఎలక్టోర్స్‌లో ఆధిక్యంలో కొనసాగుతున్నాయి. 2024 అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ ప్రస్తుతానికి 277 ఎలక్టోర్స్‌లో విజయం సాధించారు. గట్టి పోటీ ఇస్తారు అనుకున్న డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి కమలా హారిస్ కేవలం 226 ఎలక్టోర్స్ వద్ద ఉండిపోవాల్సి వచ్చింది. ఇంకా ఫలితం రావాల్సిన 35 ఎలక్టోర్స్‌లో కూడా ట్రంప్ హవా కొనసాగుతోంది. అమెరికా ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీకి పార్లమెంట్‌లో భారీ మెజారిటీ వచ్చింది. సెనేట్‌లో మెజార్టీ రిపబ్లికన్ అభ్యర్థులు విజయం సాధించారు. రిపబ్లికన్ పార్టీకి చెందిన 51 మంది, డెమోక్రటిక్ పార్టీకి చెందిన 42 మంది అభ్యర్థులు విజయం సాధించారు. ఫాక్స్ న్యూస్ నివేదిక ప్రకారం, రిపబ్లికన్ అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ 270 ఎలక్టోరల్ ఓట్ల మెజారిటీ మార్కును అధిగమించారు. యునైటెడ్ స్టేట్స్ తదుపరి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. మెరికాలోని ఏడు స్వింగ్ రాష్ట్రాల్లో రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ ఆధిక్యం చూపారు. ఏపీ ట్రెండ్స్ ప్రకారం పెన్సిల్వేనియా, మిచిగాన్, విస్కాన్సిన్, జార్జియా, నెవాడా, అరిజోనా, నార్త్ కరోలినాలలో ట్రంప్ పైచేయి సాధించారు. రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ ఇప్పటి వరకు 24 రాష్ట్రాల్లో విజయం సాధించారు. ఇంకా 5 రాష్ట్రాల్లో ఆధిక్యంలో ఉన్నారు. ఆయన ప్రత్యర్థి డెమోక్రటిక్ అభ్యర్థి కమలా హారిస్ 17 రాష్ట్రాల్లో విజయం సాధించారు. డొనాల్డ్ ట్రంప్‌కు మెజారిటీ వచ్చిన వెంటనే ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల అధినేతల శుభాకాంక్షలు చెబుతున్నారు. ఎల్ సాల్వడార్ అధ్యక్షుడు నయీబ్ బుకెలే శుభాకాంక్షలు తెలిపారు. 'అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్‌కు అభినందనలు. దేవుడు మిమ్మల్ని ఆశీర్వదించి, మార్గదర్శకత్వం చేస్తాడు' అని అన్నారు.




ఈ రోడ్లను బాగు చేయండి సారూ ...అంటున్న ఏఐటియుసి నాయకులు

## మధుబన్ కాలనీ రహదారులు అధ్వాన్నం

బుద్వేల్, నవంబరు 6(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలో బుధవారం ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి ప్రధాన రహదారిలో నిరసన కార్యక్రమం చేయడం జరిగింది. ఈ సందర్భంగా జైపాల్ రెడ్డి మాట్లాడుతూ కాటేదాన్ నుండి రామ్ చరణ్ ఆయిల్ మిల్ , మధుబన్ , శ్రీరామ్ కాలనీ పోయే ప్రధాన రహదారి గత ఐదు , ఆరు నెలల నుండి వర్షాలకు రోడ్లు పూర్తిగా గుంతలు పడ్డాయి . ఆ యొక్క రహదారిలో పోవాలంటేనే వణుకు పుడుతుంది. రామ్ చరణ్ ఆయిల్ మిల్, రవి ఫుడ్ కంపెనీ దాటిన తర్వాత మధుబన్ కాలనీ పోయే మూలమలుపు దగ్గర మోకాళ్ళ లోతు గుంతలు పడ్డాయి. బైకులు కార్లు ఆటోలు ఆ యొక్క రహదారిలో వెళ్లాలంటనే భయపడుతున్నారు. కార్లు ఆటోలు పూర్తిగా బాడీ క్రింది భాగంలో తగులుతున్నాయి గేర్ బాక్సులు విరుగుతున్నాయి. నైట్ పూట బైకుల మీద వచ్చి కింద పడి ప్రమాదాలకు గురవుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే , కార్పొరేటర్ గాని చూసి చూడనట్లు చూసి వదిలేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు మున్సిపల్ అధికారులు గుంతలు పడుతున్న దగ్గర వెంటనే రోడ్లు మరమ్మతులు చెయ్యాలన్నారు. మున్సిపల్ అధికారులు ఇంటి టాక్సీ ల మీద పెట్టినటువంటి దృష్టి ప్రజా సమస్యల మీద కూడా దృష్టి పెట్టి పరిష్కారం అయ్యే విధంగా చూడాలని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి నాయకులు మహ్మద్ కాజా, టీ.నిరంజన్, మల్లారెడ్డి , నరేష్ , హర్ష , కృష్ణ , ప్రభు , తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ శ్రీరంగం సత్యం

## దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రియల్ ఎస్టేట్ మార్కెట్లలో హైదరాబాద్ ఒకటిగా అవతరించింది

### కేటీఆర్ గత పది సంవత్సరాల మీ పాలన ప్రజలు ఇంకా మరిచిపోలేదు టీపీసీసీ అధికార ప్రతినిధి డాక్టర్ సత్యం శ్రీరంగం.

కూకట్‌పల్లి, నవంబర్ 6 (ప్రభాత ఉదయం) రాష్ట్రంలో బిల్డర్లు పర్మిషన్ లు తీసుకోవడమే కష్టమైందని, కేవలం బ్లాక్ మెయిల్ దందా కోసమే హైడ్రాను తీసుకొచ్చారని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ చేసిన వ్యాఖ్యలను టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం తీవ్రంగా ఖండించారు. బుధవారం గాంధీ భవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సత్యం శ్రీరంగం మాట్లాడుతూ కెటిఆర్ పదకొండు నెలలవుతున్నా ముఖ్యమంత్రి రియల్ ఎస్టేట్ రంగానికి సంబంధించి ఒక్క మంచి నిర్ణయం తీసుకోలేదని అనడానికి మీకు నోరెలా వచ్చిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సంవత్సరం బడ్జెట్లో కేవలం హైదరాబాద్ నగరానికి పదివేల కోట్ల రూపాయలు కేటాయించింది. ఈ హైదరాబాద్ నగరం ఇంతగా అభివృద్ధి చెందడానికి కారణం, రియల్ ఎస్టేట్ రంగాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్లింది. 2004 -2009 వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం అని అన్నారు. గత సంవత్సరం కంటే ఈ జులై సెప్టెంబర్ నెలలో 19500 యూనిట్ల ప్లాట్లు అమ్మడం జరిగిందని, దాదాపుగా గతేడాది కంటే ఏడు శాతం అధికంగా ఆదాయం వచ్చిందని రిజిస్ట్రేషన్ డిపార్ట్మెంట్, రెవిన్యూ రికార్డ్స్ చెప్తున్నాయని అన్నారు. కేటీఆర్ బిల్డర్లు పర్మిషన్ లు తీసుకోవడమే కష్టమైందని అంటున్నారు, హైటెక్స్ లో నేరేడ్కో ఆధ్వర్యంలో ప్రాపర్టీ షో పెడితే ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వచ్చి బిల్డర్లకు మనో ధైర్యాన్ని కల్పించి మీకు తోడుగా ఉంటామని మీరు చేపట్టే అన్ని కార్యక్రమాలకు మేము అండగా ఉంటామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని ప్రజలకి వ్యాపారస్తులకు అందరికి అనుకూలమైన ప్రభుత్వమని అన్నారు. హైడ్రా అనేది స్వచ్ఛమైన హైదరాబాద్ నగరాన్ని అందించడానికి నాళాలు, చెరువులు కబ్జాలు, అక్రమ కట్టడాలు అరికట్టడానికి, ప్రభుత్వ భూములు కాపాడడానికి తీసుకొచ్చిందని అన్నారు. ఈ హైదరాబాద్ నగరం భ్రష్టు పట్టడానికి, చెరువులు నాళాల కబ్జాలకు, అక్రమ కట్టడాలకు మీ ఎమ్మెల్యేలు, మీరే కారణం కాదా అని ప్రశ్నించారు. కేవలం ఈ పదకొండు నెలల కాలంలో నిర్మాణ రంగం కిందామీదయ్యింది అంటున్నారు. గత పది ఏళ్లలో మీరు తీసుకున్న నిర్ణయాలు కాదా, మున్సిపల్ శాఖ మంత్రిగా మీరు ఇచ్చిన పర్మిషన్ లు కాదా, మీ నాయన ప్రభుత్వ భూములు అమ్మి హైప్ చేసింది మీరు కాదా ఆ తప్పులన్నీ మీరు చేసి కాంగ్రెస్ వల్లే ఇలా అయిపోతుందని అనడం ఏంటని ప్రశ్నించారు.

## దేశ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలి

**మొదటి పేజీ తరువాయి...**

చేయాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. చదువుతో పాటు స్కిల్ ఉంటేనే ఉద్యోగాలు లభిస్తాయన్నారు. అందుకే విద్యార్థి, నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణ అందించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. టాటా ఇనిస్టిట్యూట్ సహకారంతో ఐటీఐలను ఏటీసీలుగా మారుస్తున్నామని.. సాంకేతిక నైపుణ్యంతో పాటు ప్రభుత్వం ఉద్యోగ భద్రతను కల్పిస్తోందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. చదువుతో పాటు విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి.. విద్యార్థులు క్రీడల్లో రాణించాలని వారిని ప్రోత్సహించే ప్రయత్నం చేస్తున్నాం.వచ్చే ఒలింపిక్స్ లక్ష్యంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేయబోతున్నాం. ఇవాళ్టి విద్యార్థులు రేపటి పౌరులుగా మారి తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి. సచివాలయం రాష్ట్రానికి గుండెకాయ లాంటిది. ఉన్నత చదువులు చదివి భవిష్యత్ లో మీరు సచివాలయంలో అడుగు పెట్టాలని? పరిపాలనలో భాగస్వాములు కావాలని ఆకాంక్షిస్తున్నా. గంజాయి, డ్రగ్స్ ఎక్కడ కనిపించినా 100కు డయల్ చేసి సమాచారం అందించండి. వ్యసనాలకు బానిసైతే జీవితాలు నాశనం అవుతాయి. ప్రతీ ఒక్కరు సామాజిక బాధ్యతను అలవరచుకోవాలి. 14 నవంబర్ న 15వేల మంది విద్యార్థులతో ఒక మంచి కార్యక్రమం తీసుకుంటున్నాం. అదే రోజు ఫేజ్-2 ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ మంజూరు చేయబోతున్నామని సీఎం తెలిపారు. ప్రభుత్వ వసతిగృహ విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచిన నేపథ్యంలో సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సంక్షేమ హాస్టల్స్ విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.



## రాహుల్ గాంధీ సమగ్ర కులగణన సదస్సులో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

కూకట్‌పల్లి, నవంబర్ 6 (ప్రభాత ఉదయం) కూకట్ పల్లి నియోజకవర్గం పరిధి బోయినపల్లి లోని గాంధీ ఐడియాలజీ కేంద్రంలో మంగళవారం జరిగిన సమగ్ర కులగణన సదస్సుకు ఏఐసీసీ అగ్రనేత, లోక్ సభ విపక్ష నేత రాహుల్ గాంధీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణలో ప్రారంభించనున్న కులగణనపై ప్రజలు, మేధావులు, వివిధ సామాజిక వర్గాల వారి సలహాలు, సూచనలను స్వీకరించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టిపిసిసి చైర్మన్ మహేష్ కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనురాధ టింబర్ డిపో వద్ద కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్వాగత వేదిక వద్ద కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ, కూకట్ పల్లి ఇంచార్జ్ బండి రమేష్, కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సంజీవరావు, కెపిహెచ్బి డివిజన్ అధ్యక్షులు తమ్మినేని ప్రవీణ్ కుమార్, పొడుగు అప్పారావు, శ్రీధర్ చారి, బాబురావు, రామకృష్ణారెడ్డి, శేషగిరి నాయుడు, గోపాల్ చౌదరి, కార్యకర్తలు నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ పెద్దమ్మతల్లి దేవాలయ 21వ వార్షికోత్సవం

### పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ..



కూకట్‌పల్లి, నవంబర్ 6 (ప్రభాత ఉదయం) శేరిలింగపల్లి నియోజక వర్గం వివేకానంద నగర్ రామకృష్ణ కాలనీలో ఉన్న శ్రీ పెద్దమ్మ తల్లి దేవాలయ 21వ సంవత్సర వార్షికోత్సవం దేవాలయ కమిటీ అధ్యక్షులు గుండడి రవికుమార్, కాలనీ అధ్యక్షులు జనంపల్లి పురేందర్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వార్షికోత్సవానికి శేరిలింగపల్లి ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీ, స్థానిక కార్పొరేటర్ రోజా దేవి రంగారావు, గొట్టుముక్కల భాస్కర రావు, చంద్రకాంత్ ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవరయ్య కమిటీ సభ్యులతో కలిసి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కమిటీ సభ్యులు కార్యదర్శి రాంచంద్రరావు, తాండవ కృష్ణ, జి ప్రసాద్, ఎస్ శ్రీధర్ రావు, సూర్యనారాయణ, చంగల్ రెడ్డి, వెంకటేశ్వరరావు, సుధాకర్, శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ వంశీ కుమార్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### ఉపాధ్యక్ష అభ్యర్థి వాన్స్
## తెలుగు సంతతి అల్లుడు

**మొదటి పేజీ తరువాయి...**

ఉపాధ్యక్షుడు కానున్నారు. 90 ఏళ్ల వయస్సులోను విద్యార్థులకు పాఠాలు చెప్పడంతో పాటు పరిశోధనలు చేస్తున్న ప్రొఫెసర్ శాంతమ్మకు ఉష మనవరాలి వరుస అవుతారు. తెలుగు ప్రొఫెసర్‌గా పని చేసిన శాంతమ్మ భర్త చిలుకూరి సుబ్రహ్మణ్య శాస్త్రి కొన్ని సంవత్సరాల క్రితం కాలం చేశారు. సుబ్రహ్మణ్య శాస్త్రి సోదరుడు రామశాస్త్రి కుమారుడైన రాధాకృష్ణ కుమార్తే ఉషా చిలుకూరి. ఉష తల్లిదండ్రులు ఎప్పుడో అమెరికాలో స్థిరపడ్డారని, ఆమె అక్కడే పుట్టి పెరిగిన నేపథ్యంలో అంతగా పరిచయం లేదని శాంతమ్మ తెలిపారు. వాన్స్ అభ్యర్థిత్వం, తమ బంధుత్వం గురించి తెలిసిన తరువాత పలువురు ఫోన్ చేసి అభినందించినట్లు శాంతమ్మ చెప్పారు. అమెరికా ఉపాధ్యక్షునిగా జేడీ వాన్స్ ఎన్నికైన నేపథ్యంలో ఆయన భార్య ఉషా చిలుకూరి పేరు ఇప్పుడు ఒక్కసారిగా మళ్లీ మార్మోగిపోతోంది.

### ట్రంప్ గెలుపుతో భారత్ బంధం
## మరింత బలోపేతం

**మొదటి పేజీ తరువాయి...**

భారత్-అమెరికా బంధం బలోపేతం అవుతుందని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. రెండు దేశాల ప్రజల జీవితాలు మెరుగుపరుద్దమని, ప్రపంచ శాంతి, సుస్థిరత, శ్రేయస్సు కోసం పనిచేద్దామని పిలుపునిచ్చారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ విజయ దుందుభి మోగిస్తున్నారు. ట్రంప్ మ్యాజిక్ ఫిగర్ 270 దాటేశాడు.. స్వింగ్ స్టేట్స్‌లో ట్రంప్ సత్తా చాటారు. ఈ ఫలితాలపై ట్రంప్ కూడా స్పందించాడు. తన జీవితంలో ఇలాంటి క్షణం ఎప్పుడూ చూడలేదని, అమెరికా ప్రజల కష్టాలు తీరబోతున్నాయని చెప్పారు. అమెరికా ప్రజలు ఇలాంటి విజయాన్ని ఎప్పుడూ చూడలేదన్నారు. అమెరికాకు పూర్వవైభవం తెస్తానని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలుచేస్తానని, తన గెలుపుతో అమెరికాకు మేలు జరుగుతుందన్నారు. స్వింగ్ రాష్ట్రాల్లో తాను ఊహించిన దానికంటే ఎక్కువ ఓట్లు వచ్చాయని చెపుకొచ్చారు. తనకు 315కు పైగా ఎలక్టోరల్ ఓట్లు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. తన విజయానికి సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. సెనెట్‌తో పాటు కాంగ్రెస్‌లో కూడా తమకే ఆధిక్యమని ఉందన్నారు. కొత్త చట్టాలను తీసుకురావడానికి తమకు ఇబ్బందులు లేవని, అమెరికాకు స్వర్ణయుగాన్ని తీసుకొస్తామని చెప్పారు. అసాధ్యాన్ని అమెరికా ప్రజలు సుసాధ్యం చేశారన్నారు. ఎవరైనా చట్టబద్ధంగానే దేశంలోకి రావాలని, సరిహద్దులను నిర్ణయిస్తామన్నారు. మస్క్ సహా తన విజయం కోసం పనిచేసిన వారికి ధన్యవాదాలు తెలియజేశారు. తన విజయంలో ఎలాన్ మస్క్‌దే కీలకపాత్ర ఉందని, అమెరికా రాజకీయాల్లో కొత్త స్టార్ ఎలాన్ మస్క్ అని కొనియాడారు. ఉపాధ్యక్షుడిగా జేడీ వాన్స్ తనకు సరైన ఛాయిస్ అని చెప్పుకొచ్చారు.

### ఆర్టికల్ 370 పునరుద్ధరణపై
## చర్చలు జరపాలి

**మొదటి పేజీ తరువాయి...**

అని ఆ తీర్మానంలో పేర్కొన్నారు. మరోవైపు బీజేపీ ఎమ్మెల్యేలు, సభలో ప్రతిపక్ష నేత సునీల్ శర్మ ఈ తీర్మానాన్ని వ్యతిరేకించారు. 'దేశంలోని అతిపెద్ద ప్రజాస్వామ్య దేవాలయం (పార్లమెంట్) ఈ చట్టాన్ని ఆమోదించింది' అని ఆయన అన్నారు. ఈ తీర్మానం ప్రతులను బీజేపీ సభ్యులు చించారు. పేపర్ ముక్కలను వెల్‌లోకి విసిరారు. లంగేట్ ఎమ్మెల్యే షేక్ ఖుర్షీద్ వెల్ లోకి దూసుకెళ్లేందుకు ప్రయత్నించగా మార్షల్స్ అడ్డుకున్నారు. అయితే ఈ గందరగోళం మధ్య స్పీకర్ అబ్దుల్ రహీమ్ రాథర్ ఈ తీర్మానంపై ఓటింగ్ నిర్వహించారు. అసెంబ్లీలోని మెజారిటీ సభ్యులు దీనికి మద్దతిచ్చారు. దీంతో ఈ తీర్మానాన్ని సభ ఆమోదించింది. గందరగోళం కొనసాగడంతో 15 నిమిషాల పాటు సభ వాయిదా పడింది.

### కొలువుదీరిన
## టిటిడి పాలక మండలి

**మొదటి పేజీ తరువాయి...**

పాలకమండలి సమావేశంలో కొన్ని కీలక నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు. తిరుమల పవిత్రను కాపాడే విధంగా నిర్ణయాలు ఉంటాయని తెలిపారు. సామాన్య భక్తులకు త్వరగతిన దర్శనం కల్పించే విదంగా చర్యలు తీసుకుంటామని వ్యాఖ్యానించారు. శ్రీవాణి ట్రస్టు నుంచి నిధులు దారి మళ్ళాయని ప్రజల్లో అపోహ ఉందని.. శ్రీవాణి ట్రస్టు నిధుల మల్లింపుపై విజిలేన్స్ నివేదిక వచ్చిన అనంతరం ట్రస్టు కొనసాగింపుపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఈ క్రమంలోనే బ్రహ్మోత్సవాలు విజయవంతంగా నిర్వహించిన అధికారులకు అభినందనలు తెలిపారు. తిరుమలలో అన్యమత ప్రచార నిర్వహణని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించమని తేల్చి చెప్పారు.

## హైడ్రా నిర్మాణాలకు అనుమతి ఇవ్వదు

**మొదటి పేజీ తరువాయి...**

తొమ్మిది నుంచి.. 13 శాతం వరకు వడ్డీ వసూలు చేస్తున్నాయి. బ్యాంకర్లు సామాజిక బాధ్యతతో పనిచేయాలి. రుణాలు ఇచ్చే ముందు ఉన్న నిబంధనలు సరళ తరం చేయాలి. ప్రైవేటు విభాగాల్లో బ్యాంకర్లు ఇచ్చిన రుణాల రికవరీ శాతం తక్కువగా ఉంటుంది. అదే స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఇచ్చిన రుణాల రికవరీ శాతం చూస్తే 98 శాతానికి పైగా ఉంది. హైదరాబాదులో 3000 కోట్ల వడ్డీ లేని రుణాలు మహిళలకు ఇవ్వాలని నిర్ణయించాం. వాటిని ఐదు వేల కోట్లకు తీసుకువెళ్లాలి. అని ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు.

# సమగ్ర కుటుంబ సర్వేకు ప్రతి ఒక్కరు సహకరించాలి: ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్



సమగ్ర కుటుంబ సర్వే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్



మైలాల్ దేవుపల్లిలోని ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ నివాసానికి సమగ్ర కుటుంబ సర్వే స్టిక్కర్ ను అతికిస్తున్న ఎన్యూమ రేటర్ నవనీత, చిత్రంలో డిప్యూటీ కమిషనర్ కె రవికుమార్



అత్తాపూర్ లక్ష్మీ రామ్ హరన్ ఆశు టవర్స్ లో సమగ్ర కుటుంబ సర్వే వివరాలు తెలియజేస్తున్న డిప్యూటీ కమిషనర్ కె .రవికుమార్



మైలార్ దేవ్ పల్లి లో సమగ్ర కుటుంబ సర్వే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎ. సదాలక్ష్మి

బుద్వేల్, నవంబర్ 6(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ సర్కిల్ లో చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వేలో ప్రజలు తమ పూర్తి వివరాలు తెలియజేసి సహకరించాలని ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ అన్నారు. మైలార్ దేవు పల్లి లోని తన నివాసంలో బుధవారం సమగ్ర కుటుంబ సర్వే కార్యక్రమాన్ని డిప్యూటీ కమిషనర్ కె. రవి కుమార్ తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి తెలంగాణ రాష్ట్రంలో సమగ్ర కుటుంబ సర్వే ను చేపడుతున్నారని గుర్తు చేశారు . ఇంట్లో ఉన్న సభ్యుల వివరాల తోపాటు చదువు, కులము, ప్రభుత్వ పథకాల కోసం అవసరం ఉన్నవారు తమ పూర్తి వివరాలు తెలియజేయాలన్నారు. డిప్యూటీ కమిషనర్ కి రవికుమార్ మాట్లాడుతూ బుధవారం ప్రతి ఇంటికి వెళ్లి కుటుంబ సర్వే కు సంబంధించిన స్టిక్కర్ ను వేయడం జరుగుతుందన్నారు. మూడు రోజుల అనంతరం ఆ ఇళ్లలోని సభ్యుల వివరాలు, పూర్తి సమాచారాన్ని సేకరించడం జరుగుతుందన్నారు . ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ బాల నరసింహ, ఎన్యుమారేటర్ నవనీత, టీఐ మహేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**అత్తాపూర్ లక్ష్మీరామ్ హరన్ ఆశు టవర్స్ లో.....**

అత్తాపూర్ హైదర్ గూడ లోని లక్ష్మి రామ్ హరన్ అశు టవర్స్ లో డిప్యూటీ కమిషనర్ కె రవి కుమార్ అపార్ట్మెంట్ నివాసులకు సమగ్ర కుటుంబ సర్వే గురించి అవగాహన కల్పించారు. అపార్ట్మెంట్ లో ఉన్న నివాసాలకు సూపర్వైజర్లతో కలిసి స్టిక్కర్లు వేశారు. రోజు రోజుల తర్వాత ప్రతి ఇంటికి సూపర్వైజర్లు వస్తార ని వాళ్ళకి కుటుంబ సమాచారాన్ని తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు, సామాజిక కార్యకర్త మ్యాడం మధుసూదన్ , ఎన్యు మరేటర్ లు పాల్గొన్నారు.

**మైలార్ దేవుపల్లిలో సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలించిన కాంగ్రెస్ నాయకురాలు ఎ. సదాలక్ష్మి :**

మైలార్ దేవుపల్లిలో బుధవారం జరిగిన సమగ్ర కుటుంబ సర్వే తీరును మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, గ్రేస్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు సదా లక్ష్మీ పరిశీలించారు . ప్రతి ఒక్కరి వివరాలను పూర్తిగా తీసుకోవాలని ఎన్యూమ రేటర్లకు సూచించారు. సూపర్వైజర్ బాల నరసింహ, ఎన్యుమారేటర్ లావణ్య మహేందర్ లు ఈ సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొన్నారు. బుధవారం సాయంత్రం వరకు 300 కుటుంబాలకు స్టిక్కర్లు వేశామని తెలిపారని ఆమె వెల్లడించారు. మూడు రోజుల తర్వాత స్టిక్కర్లు వేసిన కుటుంబాల వివరాలు సేకరిస్థారన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సదాలక్ష్మి సూచించారు. విద్యార్హత , నిరుద్యోగులైన వివరాలు, పథకాలు కావాల్సిన వారు తమ వివరాలు తెలియచేయాలన్నారు.



విద్యార్థుల క్రీడా ప్రోత్సానికి ఆర్థిక తోడ్పాటు అందిస్తున్న ఉపాధ్యాయులు

# విద్యార్థులు క్రీడల్లో రాణించేందుకు ఉపాధ్యాయుల ఆర్థిక సహాయం

## ఉదారత చాటుకున్న ఉపాధ్యాయులు

రాజేంద్రనగర్, నవంబర్ 6(ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని శివరాంపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులు క్రీడల్లో ప్రతిభను చాటారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు ఉపాధ్యాయులు క్రీడా సామాగ్రిని అందజేసి ప్రోత్సహించారు. రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక అయిన శివరాంపల్లి విద్యార్థులు సభ ఆన్సరి, సాబెణ్ణ లు గురువారం ( ఈనెల ఏడవ తేదీ ) భువనగిరిలో జరిగే కబడ్డీ పోటీలకు హాజరు కావలసి ఉండగా. విద్యార్థులు పోటీలలో పాల్గొనడానికి కావలసిన కబడ్డీ బూట్లు , ట్రాక్ షూట్, నీ క్యాప్స్, స్పోర్ట్స్ కిట్ లను కొనుక్కోవడానికి ఆర్థిక సాయం చేసి తమ ఉదారత చాటుకున్నారు శివరాంపల్లీ ఉపాధ్యాయులు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కిషన్, ఫిజికల్ డైరెక్టర్లు లు గాంగ్య నాయక్, జ్యోతి, దాతలు జే. కవిత, మహేశ్వరి, వసుంధర, నాగమణి, సులక్షణ ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



టీజీఎస్ పీడీసీఎల్ ఆర్ ఆర్ జోన్ సీజీఎం పాండ్యా నాయక్ కు పుష్పగుచు అందజేస్తున్న విద్యుత్ ఉద్యోగ సంఘం నేత ఎం భాస్కర్ రెడ్డి

# విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి: ఎం భాస్కర్ రెడ్డి

గండిపేట, నవంబర్ 6(ప్రభాత ఉదయం) విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని విద్యుత్ ఉద్యోగుల 1104 సంఘం కంపెనీ అడిషనల్ సెక్రెటరీ ఎం భాస్కర్ రెడ్డి అన్నారు. బుధవారం టి జి ఎస్ పి డి సి ఎల్ ఆర్ జోన్ సిజిఎం పాండ్య నాయక్ ను మర్యాదపూర్వకంగా ఆయన 1104 యూనియన్ నాయకులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిసి ఉద్యోగుల సమస్యలను వివరించారు. రంగారెడ్డి జోన్ చీఫ్ ఇంజనీర్ ఎల్ పాండ్య ని 110 సైబర్ సిటీ సర్కిల్ రీజినల్ బాడీమర్యాద పూర్వకంగా కలసి ఉద్యోగుల వివిధ సమస్యలపై క్లుప్తంగా వివరించారు. విద్యుత్ ఉద్యోగుల పదోన్నతులు, ఓబిడి మెటీరియల్స్ , సబ్ స్టేషన్ ఆపరేటర్స్, స్పాట్ బిల్లింగ్, ఫీల్డ్, మొదలగు సమస్యల పట్ల చీఫ్ ఇంజనీర్ కి చెప్పడం జరిగింది .ఈ అంశాలన్నింటినీ సమస్యల పట్ల సిజిఎం పాండ్యా నాయక్ సానుకూలంగా స్పందించారని ఉద్యోగ సంఘం నేత భాస్కర్ రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో 1104 కంపెనీ అడిషనల్ సెక్రటరీ, సైబర్ సిటీ సర్కిల్ రీజినల్ సెక్రటరీ ఎం భాస్కర్ రెడ్డి ,సైబర్ సిటీ సర్కిల్ రీజినల్ ప్రెసిడెంట్ శ్రీ రామ్ మోహన్ , రీజినల్ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రభాకర్ , సైబర్ సిటీ సర్కిల్ ఆఫీసు సెక్రటరీ గౌస్ ,ఇబ్రహీం బాగ్ డివిజన్ ప్రెసిడెంట్ రత్నం , సెక్రటరీ మూర్తి , గచ్చి బౌలి డివిజన్ ప్రెసిడెంట్ లింగుస్వామి , సెక్రటరీ రవికిరణ్ , కొండా పూర్ డివిజన్ ప్రెసిడెంట్ భిక్షపతి , సెక్రటరీ కుమార్, నాయకులు, కార్మిక సోదరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావుతో మర్యాద పూర్వక భేటీ

బుద్వేల్, నవంబరు 6(ప్రభాత ఉదయం): తెలంగాణ రాష్ట్రంలో సహకార వ్యవస్థ మరింత భలోపేతం కావాలని వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రాజేంద్రనగర్ లోని ఇన్స్టిట్యూట్ ఆఫ్ కోఆపరేటివ్ మేనేజ్మెంట్ (ఐ సీ ఎం) డైరెక్టర్ డాక్టర్ గణేశన్ బుదవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో సమావేశమై సంస్థ శిక్షణా కార్యక్రమాల గురించి చర్చించారు. ఐ సీ ఎం చేస్తున్న కృషికి మంత్రి ప్రశంసలు వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని అగ్రికల్చర్ మార్కెటింగ్ కమిటీల సామర్థ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో ప్రత్యేక శిక్షణ మాడ్యూళ్లను అభివృద్ధి చేయాలని మంత్రి సిఫార్సు చేశారని ఈ సమావేశంలో పాల్గొన్న డాక్టర్ యస్. ఎల్. ఎన్. టి.. శ్రీనివాస్ తెలియచేసారు.



వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును మర్యాదపూర్వగా కలిసిన ఐ సిఎం డైరెక్టర్ డాక్టర్ గణేశన్ , ఫ్యాకల్టీ డాక్టర్ ఎస్ ఎల్ ఎన్ టి శ్రీనివాస్

# దళిత నాయకుడు తెలగమల్ల శంకర్ అనారోగ్యంతో మృతి



బుద్వేల్, నవంబరు 6(ప్రభాత ఉదయం) : దళిత నాయకుడు, రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్ దేవు పల్లి ప్రగతి కాలనీ నివాసులు తెలగమల్ల శంకర్( 55) మంగళవారం అర్ధ రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన అంత్యక్రియలు బుధవారం మైలార్ దేవుపల్లి స్మశాన వాటికలో జరిగాయి. టి .శంకర్ భార్య పద్మ 45 రోజుల క్రితమే మరణించింది. ఆయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. శంకర్ జీవించి ఉన్న కాలంలో అందరితో కలుపుగోలుగా ఉండే వాళ్ళని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఏ సదాలక్ష్మి అన్నారు. ఆయన ఆత్మకు భగవంతుడు శాంతి చేకూర్చాలని ప్రార్థించారు.



హైదర్ గూడ శ్రీ పోచమ్మ దేవాలయ పునర్నిర్మాణ పూజల లో పాల్గొన్న బస్తి పెద్దలు, స్థానికులు



హోమం చేస్తున్న భక్తులు

# హైదర్‌గూడ శ్రీ పోచమ్మ దేవాలయ పునర్నిర్మాణ పూజలు ప్రారంభం

## బ్యాండు చప్పుళ్ల మధ్య అమ్మవారి విగ్రహ ఊరేగింపు. భక్తిశ్రద్ధలతో కొనసాగిన పూజలు.

బుద్వేల్, నవంబరు 6(ప్రభాత ఉదయం): అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడలోని శ్రీ పోచమ్మ దేవాలయ పునర్నిర్మాణ పూజలు బుధవారం ఘనంగా ప్రారంభమైయ్యాయి. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య తెల్లవారుజాము నుంచే దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. స్థానిక ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వహకులు భారీ ఏర్పాట్లు చేశారు. దేవాలయంలో హోమాన్ని నిర్వహించి అమ్మవారి విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు. హైదర్‌గూడ పోచమ్మ దేవాలయం పునర్ని ర్మాణం సందర్భంగా హైదర్‌గూడలో పండుగ వాతావరణం నెలకొంది. కోరిన కోరికలు తీర్చే చారిత్రాత్మకమైన పోచమ్మ దేవాలయాన్ని అధునాతన పద్దతిలో అభివృద్ధి పరచనున్నామని దేవాలయ కమిటి సభ్యులు వెల్లడించారు. దాతల నుంచి విరాళాలను సేకరిస్తున్నామని దేవాలయ నిర్మాణానికి తమవంతు సహకారం అందించాలని కోరారు. ఈ పూజల్లో సోమారం రాజ్‌కుమార్, సోమారం రవీందర్, వనం నర్సింహ్మా, బాలసుబ్రహ్మణ్యం, కొలన్ సుభాష్‌రెడ్డి, బాలమురలీకృష్ణ, శ్రీకాంత్, సోమవారం శ్రీనివాస్, ప్రణవ భక్త సమాజం సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



కుటుంబాల సమేతంగా....




ప్రజలను పరిశీలిస్తున్న జిమ్స్ వైద్య సిబ్బంది, పీజీ విద్యార్థులు

# బుద్వేల్‌లో జిమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ప్రపంచ మధుమేహ దినోత్సవం

బుద్వేల్, నవంబరు 6(ప్రభాత ఉదయం): ముచ్చింతల్ లో గల జిమ్స్ హోమియోపతిక్ మెడికల్ కాలేజీ , ఆసుపత్రి- ఎన్ ఎస్ ఎస్ (నేషనల్ సర్వీస్ స్కీం) విభాగం వారి ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ సర్కిల్ బుద్వేల్ చింతల్ బస్తీ లో బుదవారం ప్రపంచ మధు మేహం వ్యాధి వారం నిర్వహించారు . ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధి గా విచ్చేసిన జిమ్స్ డాక్టర్ టి సురేఖ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంలో ప్రీ-డయాబెటిక్, దయాబెటిక్ వ్యక్తులకు ఉచితంగా దయాబెటిస్ స్క్రీనింగ్ చెసి మందులు అందించామన్నారు . స్టాండర్డ్ స్కోర్లు , గ్లూకోజ్ పరీక్షలు ప్రమాదంలో ఉన్నవారిని గుర్తించడానికి ఉపయోగించబడ్డాయాన్నారు రోగి ప్రీడయాబెటిక్ దశలో ఉంటే, దానిని ఎలా నివారించాలో, డైట్ చార్ట్ ప్రకారం సూచించడం జరిగిందని తెలిపారు. ఇప్పటికే మధుమేహం ఉన్నవారిని గుర్తించడం జరిగిందని , డైట్ చార్ట్ కూడా ఇవ్వబడిందన్నారు. ఈ సందర్భంగా జిమ్స్ డాక్టర్స్ బృందం ర్యాలీ, నాటిక, సమావేశం ద్వారా మధుమేహం పట్ల అవగాహనా కల్పిస్తూ..సుమారు 120 మందికి పైగా షుగర్ పరీక్షలు నిర్వహించి ఫ్రీ గా మందులు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ విష్ణు, జిమ్స్ పి జి డాక్టర్లు, ఇంటర్న్లు, వైద్య బృందం, స్థానిక పెద్దలు ఎమ్ పెంటయ్య గౌడ్, సాయి క్రిష్ణ కాలనీ ప్రెసిడెంట్ బి శ్రీనివాస్, ఎమ్ తానేష్ గౌడ్, సాగర్ , ఇతర గణేష్ మండపం సభ్యులు బస్తీ ప్రజలు పాల్గొన్నారు.




మధుమేహం పట్ల జాగ్రత్తగా ఉండాలని బుద్వేల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న జిమ్స్ వైద్య సిబ్బంది

# యేసయ్యను ప్రార్థించి పొందుకునే వారిగా ఉండాలి : పాస్టర్ హెప్పి భాస్కర్



బైబిల్ సందేశాలను అందజేస్తున్న పాస్టర్ హెప్పీ భాస్కర్



సదస్సులో పాల్గొన్న పాస్టరమ్మలు



ఆతిథ్యమిచ్చిన పాస్టర్ పద్మ ఇశ్రాయేలు



పాస్టరమ్మల సదస్సు ను నడిపించిన పాస్టర్ ఎస్ ఏసుమణి



కార్యదర్శి నివేధికను చదివి వినిపించిన పాస్టర్ ఎన్ స్వర్ణ రాజారాం

బుద్వేల్, నవంబరు 6 (ప్రభాత ఉదయం): క్రైస్తవ ఆధ్యాత్మిక జీవితాన్ని జీవిస్తూ యేసయ్య మార్గంలో నడుస్తున్న వారు ఆయనను కనిపెట్టుకుంటూ వెంబడించినప్పుడు విజయం చేకూరుతుందని బండ్లగూడ జాగీర్ కు చెందిన బెతేల్ పవర్ మినిస్ట్రీస్ పాస్టర్ హెప్పీ భాస్కర్ అన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ శివరాంపల్లిలోని ఇశ్రాయేలు క్రైస్ట్ మినిస్ట్రీస్ లో ఆ సంఘ నిర్వాహకురాలు పాస్టర్ పద్మ ఇశ్రాయేలు ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్ పాస్టరమ్మ ల సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న పాస్టర్ హెప్పీ భాస్కర్ యేసయ్య మార్గంలో అనేకమంది ఉన్నప్పటికీ ఆయన సేవ చేయడానికి ఏర్పరచుకున్న పాస్టరమ్మ లందరు ప్రార్థించే వారిగా ఉండాలన్నారు. బైబిల్ లో మరియ ప్రార్థించి ఏ విధంగా కనిపెట్టి ప్రార్థనలకు ఫలితాలు పొందిందో ఆ విధంగా పాస్టరమ్మలు తమ మనవులను దేవుని వద్ద ప్రార్థించి పొందుకునే వారిగా ఉండాలన్నారు. ఈ సదస్సుకు రాజేంద్రనగర్ పాస్టరమ్మల సంఘం ఉపాధ్యక్షురాలు పాస్టర్ ఎస్ ఏసుమణి అధ్యక్షత వహించి నడిపించారు. పాస్టర్ సువార్తమ్మ ఆరాధనలో నడిపించగా, పాస్టర్ కె . స్పందన , పాస్టర్ ఎన్ స్వర్ణ, పాస్టర్ పావనీ లు పాటలు పాడారు. పాస్టర్ పల్లవి దేవుడు తన జీవితంలో చేసిన మేలులను గురించి సాక్ష్యం చెప్పి దేవుని మహిమ పరిచారు. పాస్టరమ్మల సంఘం నివేదికను సంఘం ప్రధాన కార్యదర్శి ఎన్ స్వర్ణ రాజారామ్ వివరించారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ పాస్టరమ్మల సంఘం అధ్యక్షురాలు పాస్టర్ పి అనురాధ స్వర్ణకుమార్, పాస్టర్ పద్మ , పాస్టర్ సిహెచ్ లీనా కుమారి, పాస్టర్ డి జయ పాల్, పాస్టర్ కవిత పాల్ , పాస్టర్ ప్రవీణ కుమారి, పాస్టర్ ప్రవీణ శ్రీకాంత్, పాస్టర్లమ్మలు, విశ్వాసులు పాల్గొన్నారు.

# మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలోనే ఓల్డ్ బోయిన్‌పల్లి వేల కోట్లతో అభివృద్ధి చేశాం

**హైదరాబాద్ మహా నగరాన్ని అత్యంత సుందరంగా తీర్చిదిద్దిన ఘనత మాజీ మంత్రి కేటీఆర్ కే దక్కుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం అయినా అభివృద్ధి మాత్రం శూన్యం: కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**



ఎమ్మెల్యే కృష్ణారావుతో స్థానిక నాయకులు

కూకట్‌పల్లి, నవంబర్ 6 (ప్రభాత ఉదయం) అసెంబ్లీ ఎన్నికల్లో ఓల్డ్ బోయిన్ పల్లి నాయకులు కార్యకర్తలు సమిష్టి కృషి వల్ల నియోజకవర్గంలోనే అత్యంత మెజారిటీ ఓల్డ్ బోయిన్ పల్లి డివిజన్ లో వచ్చిందని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కూకట్ పల్లి నియోజకవర్గంలోని ఓల్డ్ బోయిన్ పల్లి డివిజన్ లో స్థానిక కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హాజరయ్యారు. ఈ సమావేశంలో కార్యకర్తలు తమ డివిజన్ లో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ... నియోజకవర్గంలోని అన్ని డివిజన్ లో మాజీ మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో వేలకోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేసామన్నారు. డివిజన్ లోని బోయిన్ చెరువు అభివృద్ధి పనులు రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజలకు ఎలాంటి సమస్యలను రాకుండా చూసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కే దక్కుతుందన్నారు. కానీ ప్రస్తుత ప్రభుత్వ ఆధ్వర్యంలో నియోజకవర్గం పైన ఒక్క రూపాయి కూడా నిధులు కేటాయించకోవడం దారుణమని, అదేవిధంగా అధికారులు పనులు చేయకుండా నిర్లక్ష్య వైఖరికి పాల్పడుతున్నారన్నారు. డివిజన్లో వీధిలైట్ల కోసం అధికారులను సంప్రదించగా రెండు నెలల సమయం పడుతుందని చెప్పడం విడ్డూరమన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలిగిన బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని ప్రజలు, కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని ఎమ్మెల్యే అన్నారు. ఈ ప్రభుత్వంలో 6 గ్యారంటీలను గాలికి వదిలే చేయడం తప్ప అభివృద్ధి పై దృష్టిసారించలేదని, ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలం దగ్గరవుతున్న అభివృద్ధి మాత్రం శూన్యమని ఇప్పటికైనా అభివృద్ధిపై దృష్టి సారించి ప్రజా సమస్యలను తెలుసుకోవాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఈ సమావేశములో ఇర్ఫాన్, నరేందర్ గౌడ్, మక్కల నరసింగరావు, బాలరాజ్, ఎజాజ్, జంగయ్య, ఉదయ్ యాదవ్, అవినాష్, లలిత, అనురాధ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కంపెనీలో ఘట్టమైన మంటలు

## కాంసాన్ పరిశ్రమలో అగ్ని ప్రమాదం

**కోట్ల రూపాయల ఆస్తి నష్టం**

నందిగామ, నవంబర్ 6 (ప్రభాత ఉదయం) నందిగామ మండల కేంద్రం శివారులో బుధవారం తెల్లవారుజామున కాంసాన్ పరిశ్రమలో హైజెనిక్ డైపర్ ప్లాంట్లో ఘోర అగ్ని ప్రమాదం సంభవించింది. అర్ధరాత్రి దాటిన తర్వాత కరెంట్ షాట్ సర్క్యూట్ ద్వారానే ప్రమాదం సంభవించిందని భావిస్తున్నారు. ఈ అగ్ని ప్రమాదంలో కోట్ల విలువచేసే మిషనరీ అగ్నికి పూర్తిగా ఆహుతి అయ్యింది. ప్రమాద సమయంలో సుమారు 50 మంది కార్మికులు ప్లాంట్లో పనిచేస్తున్నారు. అర్ధరాత్రి సమయంలో ఎగిసిపడుతున్న మంటలను ఆర్పడం కోసం షాద్నగర్ నుండి అగ్నిమాపక దళాలు రంగ ప్రవేశం చేశారు. మహేశ్వరం, రాజేంద్రనగర్, చంద్రాయన గుట్ట, జూపార్క్ తాడ్ బన్ ప్రదేశాల నుండి అగ్నిమాపక దళాలు యుద్ధ ప్రాతిపదికన వచ్చి మంటలను ఆర్పారు. ఈ సంఘటనపై నందిగామ పోలీసు, రెవెన్యూ అధికారులు దర్యాప్తు జరుపుతున్నారు. పరిశ్రమలో ఎంత మేరకు ఆస్తి నష్టం జరిగిందో పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



బుగ్గిపాలైన కంపెనీ



అయ్యప్ప దేవాలయ నిర్మాణం కోసం విరాల అందజేస్తున్న అరటి విజయ యాదయ్య దంపతులు

## అరటి విజయ-యాదయ్య దంపతుల ఔదార్యం

**దేవాలయ నిర్మాణానికి రూ.1 లక్ష విరాళం**

నందిగామ, నవంబర్ 6 (ప్రభాత ఉదయం) నందిగామ మండల కేంద్రంలో నూతనంగా పునర్మిస్తున్న అయ్యప్ప స్వామి దేవాలయానికి షాద్ నగర్ పట్టణానికి చెందిన అరటి విజయ - యాదయ్య దంపతులు తమ చిన్న కుమారుడు ఆకాష్ యాదవ్ జన్మదిన సందర్భంగా అయ్యప్ప దేవాలయ ప్రహరీ గోడ నిర్మాణం కోసం రూ.1 లక్ష విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా గురుస్వామి శ్రీశ్రీశ్రీ గిరీష్ నాయర్ బర్త్డే బాయ్ ఆకాష్ యాదవ్ ను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా పలువురు స్వాములు ఆకాష్ యాదవ్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేపల్లే కుమార్ గౌడ్, బి కృష్ణ యాదవ్, చించేటి కృష్ణ గౌడ్, నరసింహులు గౌడ్ ,నిరంజన్ గౌడ్, మల్లేష్ యాదవ్, అరటి రవితేజ తదితరులు ఉన్నారు.



షాట్ పుట్ లో గోల్డ్ మెడల్ సాధించిన అలేఖ్య

## షాట్ పుట్ పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపికైన కేజిబివి విద్యార్థిని అలైఖ్య

గద్వాల, నవంబర్ 6(ప్రభాత ఉదయం)కేటిదొడ్డి కేజిబివి విద్యార్థిని అలైఖ్య ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ సాధించింది. ఈనెల 5న మహబూబ్ నగర్ లో నిర్వహించిన 68 ఎస్ జి ఎఫ్ జోనల్ అథ్లెటిక్స్ అండర్ 17 బాలికల విభాగంలో షాట్ పుట్ పోటీలలో విద్యార్థిని అలైఖ్య ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎన్నికైనట్లు ఎస్ఓ పద్మావతి, పిఈటి అరుణ తెలిపారు.





రోడ్డుపై ఏర్పాటు చేసిన వ్యాపార ప్రకటనల రోడ్డులు

## రోడ్డుపై... బోర్డులు ఏర్పాటు చేస్తే ప్రమాదం జరగదా ?

కుషాయిగూడ, నవంబర్ 6(ప్రభాత ఉదయం) కుషాయిగూడ బస్టాండ్ నుంచి వెంకటేశ్వర స్వామి దేవాలయం వరకు రోడ్డుకిరువైపులా వ్యాపార ప్రకటనల బోర్డులు ఏర్పాటు చేయడం వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోచమ్మ గుడి డి మార్ట్ రోడ్డులో దుకాణదారులు రహదారుల పై వ్యాపార ప్రకటనల బోర్డులు ప్రమాదకరంగా ఉంచుతున్నారు. నడిచే రోడ్డు పై అడ్డుగా ప్రకటనల బోర్డులు పెడుతుండడంతో గత్యంతరం లేక పాదచారులు రోడ్డుపై నడుస్తుండడం మూలంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతూ వెళ్తున్నారు. కుషాయిగూడ బస్టాండ్ సమీపంలోని బుధవారం అరగంట క్రితం ప్రభుత్వ ప్రాథమిక ఉపకేంద్రం ఎదురుగా దృశ్యం కనిపించింది.కుషాయిగూడ ట్రాఫికపోలీసులు... జిహెచ్ఎంసి కాప్రా సర్కిల్ టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు చర్యలు చేపట్టాలని చర్లపల్లి కాలనీల సిసిఎస్ కుటుంబాల పక్షాన విజ్ఞప్తి చేస్తున్నారు.



హుండీ ఆదాయం లెక్కిస్తున్న నిర్వాహకులు

## పాగుంట శ్రీ లక్ష్మీవెంకటేశ్వర ఆలయ హుండీ లెక్కింపు

కేటిదొడ్డి, నవంబర్ 6(ప్రభాత ఉదయం) కేటిదొడ్డి మండలంలోని పాగుంట శ్రీ లక్ష్మీవెంకటేశ్వర ఆలయ హుండీ లెక్కింపు బుధవారం నిర్వహించారు. దేవాదయశాఖ పర్యవేక్షణ అధికారిణి వెంకటేశ్వరమ్మ సమక్షంలో ఆలయఈవో పురేందర్ ఆధ్వర్యంలో హుండీ లెక్కించగా. రూ.9,21,610 నగదు వచ్చినట్లు ఈవో తెలిపారు. ఈ సంవత్సరం 13 నెలల 15 రోజులకుగాను ఆలయాన్ని సందర్శించిన భక్తులపరంగా రూ.57,612 నగదు హుండీ ఆదాయం వచ్చినట్లు ఈవో తెలిపారు



ధ్వజస్తంభం మహెూత్సవంలో గ్రామస్తులు

## వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహెూత్సవం

కేటిదొడ్డి, నవంబర్ 6 (ప్రభాత ఉదయం) మండల పరిధిలోని ఉమిత్యాల గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో బుధవారం శ్రీఆంజనేయ స్వామి విగ్రహాలు, ధ్వజస్థంభ ప్రతిష్ట కార్యక్రమం వైభవంగా జరిగింది. మూడు రోజుల పాటు జరిగే ఈ ప్రతిష్టాపన పూజల్లోభాగంగా తొలి రోజు ఆరాధాన, పుణ్యాహవచనం, యాగశాల ప్రవేశం, అఖండ దీపారాధన, తీర్థ ప్రసాద వితరణ నిర్వహించినట్లు ఆలయ అర్చకులు, ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. మూడో రోజు వేధపండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా యంత్ర ప్రతిష్ట చేసి శ్రీఆంజనేయ స్వామి విగ్రహాలు, ధ్వజస్థంభ ప్రతిష్ట చేశారు. అనంతరం శ్రీఆంజనేయ స్వామి ఉత్సవ విగ్రహాలకు శాంతి కల్యాణం నిర్వహించారు. ధ్వజస్తంభం మహెూత్సవం సందర్భంగా వివిధ పార్టీల నాయకులు, నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్ కుమార్, నాయకులు స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ధ్వజస్తంభ ప్రతిష్టాపన మహెూత్సవంలో పాల్గొన్న నడిగడ్డ పోరాట సమితి నాయకుడు రంజిత్ కుమార్

## రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య



గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 6(ప్రభాత ఉదయం) గద్వాల పట్టణానికి చెందిన కుర్వ పరుశరాముడు (48) అనే వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గద్వాల రైల్వే స్టేషన్ పరిధిలోని వెంకంపేట శివారులో గల రైల్వే పట్టాలపై బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు రైల్వే ఎస్ఐ, కానిస్టేబుల్ సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. వివరాల మేరకు మృతుడు గద్వాల పట్టణానికి చెందిన చెందిన కుర్వ పరుశరాముడుగా గుర్తించి కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. మృతుడు హమాలి పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాని గద్వాల జిల్లా ఆసుపత్రికి తరలించారు. మృతునికి భార్య, కూతురు, కుమారులు ఉన్నారు. అవమానాలు భరించలేక కుర్వ పరుశరాముడు ఆత్మహత్య చేసుకున్నాడని బంధువులు ఆరోపిస్తున్నారు. గత కొంత కాలంగా మృతుని కూతుర్ని ప్రేమ పేరుతో ఒక ప్రేమోన్మాది వేధింపులు గురి చేస్తున్నాడని, మా కుతురు జోలికి రావద్దని ప్రేమోన్మాదిని వేడుకున్నా ప్రేమోన్మోది తీరు మారలేదని, ఎన్నిసార్లు చెప్పిన తీరు మార్చుకోకపోవడంతో మనస్తాపం చెంది కుర్వ పరుశరాముడు ఆత్మహత్య కు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

## తప్పులు దొర్లకుండా జాగ్రత్తగా సర్వే చేయాలి: జిల్లా కలెక్టర్ సంతోష్

**ప్రతిష్టాత్మకంగా ప్రారంభమైన ఇంటింటి కుటుంబ సర్వే**

గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 6(ప్రభాత ఉదయం) ఆర్థిక, సామాజిక, రాజకీయ, విద్య, ఉపాధి, కుల వివరాల సేకరణకై రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఇంటింటి కుటుంబ సర్వేకు సంబంధిత అధికారులు తప్పులు దొర్లకుండా అతి జాగ్రత్తగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ సూచించారు.గద్వాల పట్టణంలోని నల్లకుంట, వీవర్స్ కాలనీ, వడ్ల వీధి, అలాగే ధరూర్ మండల కేంద్రంలోని బీసీ కాలనీలో ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహిస్తున్న తీరును కలెక్టర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా ఇళ్లను సందర్శించి కుటుంబ సర్వే నిర్వహణ కోసం అతికించిన స్టిక్కర్లను పరిశీలించారు. ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా పకడ్బందీగా సర్వే జరపాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సంతోష్ మాట్లాడుతూ... ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఇంటింటి సర్వే కోసం ఏ ఒక్క నివాస గృహం సైతం మినహాయించబడకుండా మొత్తం 1126 ఎన్యూమరేషన్ బ్లాక్ లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఒక వంట గది ఆధారంగా ఒక కుటుంబంగా భావించి సర్వే నిర్వహించాలని, అంతేగాక పెళ్లిళ్లు అయినప్పటికీ అందరూ ఒకే గృహంలో ఉన్నట్లయితే ఒకే కుటుంబంగా లెక్కించాలని ఎన్యుమేరేటర్ లకు కలెక్టర్ సూచించారు. ఖాళీగా ఉన్న గృహాలకు కూడా వెకెంట్ అనే స్టిక్కర్ తప్పనిసరిగా వేయాలన్నారు. ఇంటింటి సర్వేలో భాగంగా ఈ నెల 6, 7, 8, తేదీలలో మూడు రోజుల పాటు హౌజ్ లిస్టింగ్ ప్రక్రియ కొనసాగుతుందని, ఈ నెల 9వ తేదీ నుండి సమగ్ర కుటుంబ వివరాల సేకరణ ప్రారంభమవుతుందని వివరించారు. గ్రామ కార్యదర్శులు అంగన్వాడీలతో పాటు ఉదయం తమ విధులు నిర్వహించుకున్న అనంతరం ఎస్జిటి లు కూడా మధ్యాహ్నం నుండి సర్వేలో పాల్గొంటున్నారని అన్నారు. సర్వే బృందానికి నిర్ణీత సమాచారాన్ని అందజేస్తూ, జిల్లాలో ఇంటింటి కుటుంబ సర్వే విజయవంతానికి అన్ని వర్గాల వారు సహకరించాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, మండల స్పెషల్ ఆఫీసర్లు, సూపర్వైజర్లు, ఎన్యుమరేటర్ లు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికి సర్వే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ సంతోష్



Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.